ఈనాడు అన్నమయ్య
శనివారం అక్టోబరు 12, 2024

నేడు జిల్లాకు మంత్రి మండిపల్లి రాక

రాయచోటి, న్యూస్‌టుడే: రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శనివారం జిల్లాకు రానున్నారు. ఉదయం 8 గంటలకు కుటుంబ సమేతంగా రాయచోటిలోని వీరభద్రస్వామి ఆలయంలో పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. 9 గంటలకు రాయచోటి కిరాణా మర్చంట్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో గాంధీబజార్‌లో సరసమైన ధరలకు వంట నూనెల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం ఒంటి గంటకు సంబేపల్లె మండలం అడవికమ్మపల్లెలో జరిగే దసరా ఉత్సవాలలో పాల్గొని వెంకటేశ్వరస్వామిని దర్శించుకుంటారని మంత్రి క్యాంపు కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

ఆడ పిల్లల్ని చదివిద్దాం.. భావితరాలకు వెలుగిద్దాం



శిశు సంక్షేమ శాఖ సిబ్బందికి జ్ఞాపిక అందిస్తున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి, న్యూస్‌టుడే: ఆడ పిల్లలను చదివించి భావి తరాల ఉత్తమ భవిష్యత్తుకు పునాది వేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో మహిళ శిశు సంక్షేమ, వైద్య ఆరోగ్య, విద్యా శాఖల ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. బాలికల రక్షించేందుకు ప్రధాన మంత్రి మోదీ 'బేటీ బచావో.. బేటీ పడావో' కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. జిల్లాలో బాల్య వివాహాలను నివారించేందుకు అధికారులు అన్ని విధాల కృషి చేస్తున్నారన్నారు. ఆసుపత్రుల్లో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న స్కానింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. జిల్లాలో ప్రతి వెయ్యి మంది బాలురకు 943 మంది బాలికలు మాత్రమే ఉన్నారన్నారు. ఈ నిష్పత్తిని సమం చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. కిశోర బాలికలను అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో గుర్తించి వారి కుటుంబ సభ్యులకు బాల్య వివాహాలు, బాలిక విద్య ప్రాముఖ్యతను తెలియజేయాలని మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారిణి రమాదేవి పేర్కొన్నారు. అనంతరం జిల్లాలో బాల్య వివాహాలు అరికట్టడంలో కృషి చేసిన అధికారులు, సిబ్బందికి జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో కొండయ్య, బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, మహిళ సంరక్షణ కార్యదర్శులు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.


రాజంపేటలో మహిషాసురమర్దనిగా సాధుకామాక్షమ్మ


మదనపల్లెలో ధనలక్ష్మిగా చౌడేశ్వరిదేవి


రాయచోటిలో భవానీగా భద్రకాళి



భయంకరి... శుభంకరి

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మహర్నవమి సందర్భంగా జగన్మాత మహిషాసుర మర్దనిగా దర్శనమిచ్చారు. అష్టభుజాలతో దుష్టుడైన మహిషాసురుడిని అమ్మవారు సంహరించింది ఈ రూపంలోనే. అందుకే ఇది నవదుర్గల్లో అత్యుగ్రరూపం. ఈ రోజున జగన్మాత కనకదుర్గమ్మ లేతరంగు దుస్తుల్లో సింహ వాహనాన్ని అధిష్టించి ఆయుధాలను ధరించి మహాశక్తిగా భక్తులకు దర్శనమిచ్చారు. రాక్షసులకు సింహస్వప్నమైన ఆ శక్తి స్వరూపిణి భక్తుల పాలిట శుభంకరిగా దుర్గమ్మగా దర్శనమిచ్చారు. జిల్లావ్యాప్తంగా ప్రముఖ ఆలయాల్లో తేజోమయ రూపంలో జగజ్జననిని దర్శని చేసుకోవడానికి భక్తులు ప్రధాన ఆలయాల్లో బారులు తీరారు. ఆయా కార్యక్రమాల చిత్రాలివి.

- న్యూస్‌టుడే, అన్నమయ్య బృందం


రైల్వేకోడూరు అమ్మవారిశాలలో భక్తుల సందడి



పీలేరు, రామసముద్రంలలో మధుర మీనాక్షిగా వాసవీ మాత

దరఖాస్తుల కిక్కు!

◆ జిల్లా నుంచి 2,111 పత్రాలు దాఖలు
◆ రూ.42.22 కోట్లకు పైగా ఆదాయం



ఈనాడు, కడప, న్యూస్‌టుడే- రాయచోటి: జిల్లాలోని 111 మద్యం దుకాణాలకు ఒక్కోదానికి సగటున దాదాపు 19 వంతున మొత్తంగా 2,111 దరఖాస్తులు అందాయి. దరఖాస్తుల ద్వారా రూ. 42.22 కోట్ల ఆదాయం రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చింది. దరఖాస్తుల గడువు శుక్రవారంతో ముగిసింది. సాయంత్రం ఏడింటి వరకు అందిన సమాచారం మేరకు దరఖాస్తుల సంఖ్య తేలింది. జిల్లాలోని ఎనిమిది సర్కిళ్ల పరిధిలో దుకాణాల నిర్వహణకు వ్యాపారులు పోటీపడ్డారు. ఒక్కో దరఖాస్తుకు దరావతు కింద రూ. 2 లక్షల చొప్పున రుసుం చెల్లించి టెండరుదారులు దరఖాస్తులు చేశారు. దరఖాస్తుల ఆధారంగా ఈనెల 14న లాటరీ విధానం కింద లైసెన్స్‌దారుల ఎంపిక కలెక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో జరుగుతుంది. పీలేరు నియోజకవర్గం పరిధిలోని కలికిరిలో 100, 101, 102 దుకాణాలకు ఇద్దరు మాత్రమే టెండరు వేశారు. అక్కడ రాజకీయ ప్రమేయంతో ఎక్కువ మంది దరఖాస్తు చేయలేకపోయారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లాటరీ ద్వారా ఎంపిక చేసిన దరఖాస్తుదారులు ఈ నెల 16 నుంచి దుకాణాలు నిర్వహించుకునే అవకాశం కల్పిస్తారు. మద్యం దుకాణాల వ్యవహారం జిల్లాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వీటి కోసం పోటీ తీవ్రంగా కనిపించింది. దరఖాస్తుల గడువు అర్ధరాత్రి 12 గంటల వరకు ఉండటంతో మరిన్ని పెరిగే అవకాశం ఉందని ఆబ్కారీ అధికారులు భావిస్తున్నారు.

చిరుత సంచారంపై ఆందోళనొద్దు

చిట్వేలి (పుల్లంపేట), న్యూస్‌టుడే: చిరుత సంచారంపై చెర్లోపల్లె గ్రామస్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డీఎఫ్‌వో వివేక్ పేర్కొన్నారు. చిట్వేలి మండల పరిధిలోని చెర్లోపల్లెలో శుక్రవారం ఆయన సిబ్బందితో కలిసి పర్యటించారు. గ్రామ సమీపంలోని మామిడి తోపులో చిరుత అడుగులను పరిశీలించారు. అనంతరం స్థానికులతో సమావేశమయ్యారు. దాదాపు ఎనిమిది సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని... ఇప్పటి వరకు చిరుత ఎక్కడ నమోదు కాలేదన్నారు. బోను ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేశామని వివరించారు. అప్పటి వరకు గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

కాచిగూడ-మంగళూరు ఎక్స్‌ప్రెస్ మురడేశ్వర్ వరకు పొడిగింపు

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : కాచిగూడ-మంగళూరు మధ్య నడుస్తున్న రైలును మురడేశ్వర్ వరకు పొడిగించినట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టరు ఎ.జనార్దన్ తెలిపారు. కాచిగూడలో ప్రతి మంగళవారం, శుక్రవారం ఉదయం 6.05 గంటలకు రైలు బయలుదేరి డోన్, గుత్తి మీదుగా కడపకు మధ్యాహ్నం 2.25 గంటలకు చేరుకుంటుంది. అక్కడి నుంచి రేణిగుంట, కోయంబత్తూరు, మంగళూరు మీదుగా మురడేశ్వర్‌కు మధ్యాహ్నం 2 గంటలకు వెళుతుంది. మురడేశ్వర్‌లో ప్రతి బుధవారం / శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం కడపకు 1.55 గంటలకు, అదే రోజు రాత్రి 11.40 గంటలకు కాచిగూడకు చేరుకుంటుంది.


14 నుంచి పట్టాభిరాముడి పవిత్రోత్సవాలు

వాల్మీకిపురం, న్యూస్‌టుడే : తితిదే ఆధ్వర్యంలో స్థానిక పట్టాభిరాముడి వార్షిక పవిత్రోత్సవాలు ఈ నెల 14 నుంచి ప్రారంభం కానున్నాయని స్థానిక తితిదే ఆలయాధికారి కృష్ణమూర్తి శుక్రవారం తెలిపారు. 14న అంకురార్పణ, 15న పవిత్ర ప్రతిష్ఠ, స్నపన తిరుమంజనసేవ, 16న పవిత్ర సమర్పణ, వైదిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 17న మహాపూర్ణాహుతి, పవిత్ర వితరణ, చక్రస్నానంతో వార్షిక పవిత్రోత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

ఓంకార రూపిణీ... ముక్తి ప్రదాయిని

శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా శుక్రవారం మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల పరిధిలోని ఆలయాల్లో అమ్మవార్లు వివిధ రూపాల్లో కొలువై దర్శనమిచ్చారు. మహిళలు పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయా ఆలయాల్లో శక్తి స్వరూపిణి దర్శనమిచ్చిన రూపాలివి.

- న్యూస్‌టుడే, మదనపల్లె క్లస్టర్ బృందం


ములకలచెరువు : ప్రత్యేక అలంకరణలో వాసవీమాత


వాల్మీకిపురం : మహిషాసురమర్దనిగా విరూపాక్షమ్మ


మదనపల్లెలో రాజరాజేశ్వరిగా వాసవీమాత


మహిషాసురమర్దని అలంకరణలో కలికిరి ఎల్లమ్మ


కలకడ : కోనలో చౌడేశ్వరీదేవి


గుర్రంకొండ: ప్రత్యేక అలంకరణలో వాసవీమాత


గుర్రంకొండ: చెర్లోపల్లెలో రెడ్డెమ్మ దేవత


కురబలకోటలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు


రామసముద్రం : తిరుమలరెడ్డిపల్లెలో మారెమ్మ


గర్నిమిట్టలో అలంకరణలో కనక దుర్గమ్మ


బి.కొత్తకోటలో దర్శనమిస్తున్న అమ్మవారు


గుర్రంకొండలో పోలేరమ్మ

మానవ అక్రమ రవాణాపై చర్యలకు డిమాండు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : మానవ అక్రమరవాణాను అరికట్టడానికి ప్రభుత్వం కఠినమైన చర్యలు చేపట్టాలని పలు ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు డిమాండు చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక అమ్మచెరువుమిట్టలోని వెలుగు ప్రత్యేక పాఠశాలలో గ్రామజ్యోతి సొసైటీ ఆధ్వర్యంలో మానవ అక్రమరవాణాపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అక్రమ రవాణాకు గురై హత్యకు గురైన వారి ఆత్మశాంతికోసం కొవ్వొత్తులు వెలిగించి మౌనం పాటించారు. అనంతరం ప్రజాసంఘాల నాయకులు యమలాసుదర్శన్, వై.ఎస్.మునిరత్నంలు మాట్లాడుతూ అక్రమ రవాణాపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రేమ, పెళ్లి, ఉద్యోగం, సినిమా అవకాశాలను ఎరగా చూపి అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని ఇలాంటి వారిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలపై అసభ్యంగా ప్రవర్తించేవారు, మాయమాటలుజెప్పి వ్యభిచారంలోకి దించే ముఠాపై చట్టపరిధిలో చర్యలు చేపట్టాలని సూచించారు. ఇలాంటి ఘటనలు జరగకుండ అడహక్ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో గ్రామజ్యోతి సొసైటీ వ్యవస్థాపకురాలు సుభద్ర, సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మునిగోపాలకృష్ణ, ఫోర్డ్‌సంస్థ డైరెక్టర్ లలితమ్మ, వెలుగు పాఠశాల కార్యదర్శి ఉదయ్‌మోహన్‌రెడ్డి, కవిత, బొజ్జప్ప, అబూబకర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు కలికిరికి మాజీ సీఎం రాక

కలికిరి, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి, భాజపా జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి శనివారం కలికిరికి రానున్నారు. శనివారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి బయలుదేరి సాయంత్రం తిరుపతి రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు. అనంతరం రోడ్డు మార్గంలో కలికిరికి చేరుకుంటారు. ఈ నెల 13న ఆదివారం కలికిరిలోని భాజపా కార్యాలయంలో కార్యకర్తలు, అభిమానులు, ప్రజలకు అందుబాటులో ఉంటారని ఆయన వ్యక్తిగత కార్యదర్శి తెలిపారు.

సనాతన ధర్మ పరిరక్షణకు కృషి

వాల్మీకిపురం, న్యూస్‌టుడే : సనాతన ధర్మాన్ని పరిరక్షించుకుందామని వాల్మీకిపురం భజరంగ్‌దళ్ యూత్ సభ్యులు హేమంత్ అన్నారు. స్థానిక శ్రీ చౌడేశ్వరీదేవి వృద్ధాశ్రమంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

బీఎంసీయూలో సిబ్బంది తొలగింపు

కంభంవారిపల్లి, న్యూస్‌టుడే : గర్నిమిట్టలో వెలుగు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీఎంసీయూ (పాలశీతల కేంద్రం)లో విధులు నిర్వర్తిస్తున్న కంప్యూటర్ ఆపరేటర్, డెయిరీ సూపర్‌వైజర్‌ను తొలగించినట్లు వెలుగు ఏరియా సమన్వయకర్త జవహర్ బాషా తెలిపారు. పాల కేంద్రంలో ఇటీవల పాల కొలతల్లో తేడా వస్తోందని, ఈ విషయమై డెయిరీ సూపర్‌వైజర్, కంప్యూటర్ ఆపరేటర్ భర్త మధ్య వాదోపవాదాలు జరిగాయి. ఈ నేపథ్యంలో అధికారులు చర్చించి సిబ్బందిని తొలగించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


రమేశ్ (పాత చిత్రం)

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే : ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందారు. హెడ్‌కానిస్టేబుల్ రమేశ్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. నిమ్మనపల్లె మండలం రాచవేటివారిపల్లె పంచాయతీ గొల్లపల్లెకు చెందిన బీదం రమేశ్ (23) అదే గ్రామానికి చెందిన ప్రేమజంట వ్యవహారంలో మద్దతు తెలిపారని కొందరు యువకుడిని దూషించి దాడికి పాల్పడ్డారు. దీన్ని అవమానంగా భావించిన రమేశ్ ఈ నెల 9న ఇంటివద్ద విషద్రావణం తాగారు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే మదనపల్లె ఆసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 10న రమేశ్ మృతిచెందారు. మృతుడి తండ్రి సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు...

వాల్మీకిపురం, న్యూస్‌టుడే : పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో గురవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తిరుపతిలో చికిత్స పొందుతున్న పండ్లవ్యాపారి రెడ్డి ఖాన్(70) శుక్రవారం మృతి చెందారు. స్థానిక ఎస్సై చంద్రశేఖర్ కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో ఢీకొని మహిళ దుర్మరణం

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : ఆటో ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన చిత్తూరు జిల్లా పుంగనూరు మండలంలో శుక్రవారం రాత్రి జరిగింది. మండలంలోని ఈడిగపల్లెకు లక్ష్మమ్మ (48) భర్త చనిపోవడంలో కూలీపనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఆమె కుమారుడు కూడా చనిపోవడంతో కోడలు వరలక్ష్మీతో కలిసి ఉంటున్నారు. ఈ క్రమంలో రాత్రి రోడ్డు పక్కన ఉన్న మందుల దుకాణంలో మాత్రలు తీసుకునేందుకు వెళ్తుండగా వేగంగా వచ్చిన ఆటో ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమెను కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

చోరీ కేసులో అంతర్ రాష్ట్ర దొంగ అరెస్టు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : చోరీ కేసులో అంతర్ రాష్ట్ర దొంగను అరెస్టు చేసినట్లు మదనపల్లె రూరల్ సీఐ కళా వెంకటరమణ తెలిపారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం కొత్తవారిపల్లె పంచాయతీ పూలవాండ్లపల్లెకు చెందిన రెడ్డిమోహన్ ఇంట్లో ఈ ఏడాది సెప్టెంబరు 26న గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి 8 గ్రాముల బంగారు, రూ.17 వేల నగదు చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. విచారణ ప్రారంభించి నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో శుక్రవారం తట్టివారిపల్లె వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా అతను అనంతపురం రూరల్ మన్నాల గ్రామానికి చెందిన జె.పుల్లనాయుడుగా గుర్తించారు. అతను ప్రస్తుతం తిరుపతిలోని తీర్థకట్ట వీధిలో ఉంటున్నాడని తెలిపారు. ఇతను మదనపల్లెలోని వివిధ ప్రాంతాల్లో దొంగతనాలు చేశాడని, ఇతని వద్ద నుంచి రూ.1.50 లక్షలు విలువైన 30 గ్రాముల బంగారు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇతనిపై ఇది వరకే కర్నూలు, ఆత్మకూరు, ప్రొద్దుటూరు, మార్కాపురం, డోన్, బళ్లారి, తెలంగాణ రాష్ట్రంలోని పలుచోట్ల నేరాలకు పాల్పడ్డాడని, 17 కేసులు ఉన్నట్లు సీఐ తెలిపారు. నిందితుడిని రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

అన్నదాత కష్టం నేలపాలు



బంతిపూలకు ధరలు ఉన్నా నాణ్యత లేకపోవడంతో తోటను దుక్కిలో కలిపేస్తున్న ఘటన అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం జంగాలపల్లె వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఓ రైతు ఎకరం పొలంలో బంతితోట సాగు చేశారు. ఇది వరకు ధరలు పతనం కావడంతో కోత కూలీ కూడా దక్కకపోవడంతో మొక్కలకు పోషకాలు అందించలేదు. దీంతో దిగుబడిలో నాణ్యత తగ్గి ఎగుమతికి పనికిరాకుండా పోయాయి. దసరా పండగ వేళ ఒక్కసారిగా బంతిపూల ధర రూ.50కు పైగా పెరిగినా పూలలో నాణ్యత లేకపోవడంతో ఎగుమతికి పనికిరాక ఇలా దున్నేస్తున్నారు. **- న్యూస్‌టుడే, రామసముద్రం**

మదనపల్లె
•మదనపల్లె • పీలేరు • తంబళ్లపల్లె

14 నుంచి గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : మదనపల్లె మండలం బసినికొండ పంచాయతీలోని నిమ్మనపల్లెరోడ్డులో నిర్మించిన శ్రీ ధనుకొండ గంగమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఈ నెల 14 నుంచి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 14న మహాగణపతి పూజ, అఖండ దీపారాధన, మహామంగళ హారతి ఉంటుందన్నారు. 15న అమ్మవారి విగ్రహ ఊరేగింపు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందన్నారు. 16న విగ్రహశుద్ధి ప్రాతఃకాల పూజ ఉంటుందన్నారు. 17న అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందని భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆలయ ప్రధాన పురోహితుడు లక్ష్మణ స్వామి తెలిపారు.

దుర్గాదేవి ఆశీస్సులు ఉండాలి

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : దుర్గాదేవి ఆశీస్సులు ప్రజలకు ఎల్లవేళలా ఉండాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. విజయదశమి పర్వదినం సందర్భంగా మదనపల్లె నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరు సుఖ సంతోషాలతో, సిరి సంపదలతో జీవించే విధంగా దుర్గామాత ప్రజలందరిని దీవించాలని ఆకాంక్షించారు.





బాలికల సంరక్షణ అందరి బాధ్యత

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే : బాలిక సంరక్షణ అందరి బాధ్యతని తలపుల పీహెచ్‌సీ హెచ్ఈ కొండయ్య అన్నారు. మండలంలోని తలపులలో ప్రపంచ బాలికల దినోత్సవం సందర్భంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. సృష్టికి ఆధారం ఆడబిడ్డ, ప్రగతికి చిహ్నం ఆడబిడ్డ అని నినాదాలు చేశారు.

పెద్దమండ్యం : సమాజంలో మగపిల్లలతో పాటూ ఆడపిల్లలను సమానంగా చూడాలని పోర్డు సంస్థ సిబ్బంది గ్రామాల్లోని మహిళలకు అవగాహన కల్పించారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మండలంలోని పడమర హరిజనవాడ, చెరువుకిందపల్లె, రామానాయక్‌తండాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోర్డు సంస్థ మండల కోఆర్డినేటర్ నరసింహులు, సిబ్బంది రెడ్డెమ్మ, అనిత, రమణ, భువనేశ్వరి, శైలజ, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, పాల్గొన్నారు.



తలపులలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

మహిళపై కత్తితో దాడి

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : మహిళపై కత్తితో దాడిచేసి గాయపరిచిన సంఘటన బి.కొత్తకోట మండలంలో గురువారం రాత్రి జరిగింది. గోళ్లపల్లె పంచాయతీ రఘునాథపురానికి చెందిన రమణమ్మకు చెందిన పాడి ఆవు గతంలో అదే గ్రామానికి చెందిన గణేష్ ఇంటి ముందు పేడ వేసింది. ఈ విషయమై గతంలో గొడవ జరిగి కేసులు పెట్టుకున్నారు. అప్పటి నుంచి రమణమ్మపై కక్ష పెంచుకున్న గణేష్ గురువారం రాత్రి ఆమె గ్రామంలో నడుచుకుంటూ వెళ్తుండగా కత్తితో దాడి చేశాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమెను కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి అవుట్ పోస్టు సిబ్బంది సమాచారాన్ని బి.కొత్తకోట పోలీసులకు తెలియజేశారు.

చేను గట్టు విషయమై ఘర్షణ... ముగ్గురికి గాయాలు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : చేనులోని గట్టు విషయమై జరిగిన గొడవలో ఓ కుటుంబంపై మరో కుటుంబం దాడి చేయడంతో ముగ్గురు గాయపడిన సంఘటన బి.కొత్తకోట మండలంలో గురువారం రాత్రి జరిగింది. బాధితుల కథనం మేరకు.. మండలంలోని రఘునాథపురానికి చెందిన వెంకటేష్ పొలంలో ఉన్న గట్టును అదే గ్రామానికి చెందిన శ్రీహరి కుటుంబ సభ్యులు ట్రాక్టర్‌తో దున్నేశారు. ఈ విషయమై వెంకటేష్ నిలదీశారు. దీంతో ఆగ్రహించిన శ్రీహరి కుటుంబ సభ్యులు వెంకటేష్, అతని కుమారుడు చిన్నవెంకటరమణ, కోడలు శంకరమ్మలపై దాడి చేసి గాయపరిచారు. దాడిలో తీవ్రంగా గాయపడిన ముగ్గురిని స్థానికులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి ...

★ కారు ఢీకొని హెచ్ఎన్ఎస్ఎస్‌లో ఎలక్ట్రిషియన్, లిఫ్ట్ ఆపరేటర్‌గా పని చేసే రాజశేఖర్‌ను కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. శుక్రవారం రాత్రి ఆయన అంగళ్లు నుంచి స్వగ్రామమైన బి.కొత్తకోట మండలం కాండ్లమడుగుక్రాస్ వద్ద ఉన్న పెద్దపల్లెకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా చెన్నామర్రి మిట్ట వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన్ను స్థానికులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

తపాలా సేవలు విస్తరించడమే లక్ష్యం

పీలేరు, న్యూస్‌టుడే : గ్రామీణ ప్రాంతాలకు తపాలాశాఖ ద్వారా అన్ని రకాల సేవలు విస్తరించడమే లక్ష్యంగా బ్రాంచి పోస్టుమాస్టర్లు పనిచేయాలని తపాలాశాఖ తిరుపతి డివిజన్ సూపరింటెండెంట్ బి. నరసప్ప అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పీలేరు తపాలా ప్రధాన కార్యాలయంలో తపాలా వారోత్సవాలను పురస్కరించుకుని ఎక్కువ పథకాలు ఖాతాదారులకు ఇవ్వడంలో కృషి చేసిన బీపీఎంలను అభినందించారు. తపాలశాఖ పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. పీలేరు పోస్టల్ ఇన్స్‌పెక్టర్ వినోద్‌కుమార్, బీపీఎంలు లావణ్య, మాధవి, ఫాతీమా, జాహ్నవిలకు ప్రోత్సాహకాలు అందజేశారు.







మదనపల్లె

•మదనపల్లె • పీలేరు • తంబళ్లపల్లె

శ్రీకృష్ణ బృందావనం ట్రస్టు ఏర్పాటు

పీలేరు, న్యూస్‌టుడే: హిందూ ధర్మాన్ని భగవద్గీత ప్రవచనాల ద్వారా విస్తరించే లక్ష్యంతో పీలేరులో శుక్రవారం న్యాయవాది బీసీ పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో 'శ్రీకృష్ణ బృందావనం ట్రస్ట్' ఏర్పాటైంది. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడిగా బీసీ పురుషోత్తంరెడ్డి, అధ్యక్షుడిగా జె.అరవింద్, ఉపాధ్యక్షులుగా మధుసూదన రెడ్డి, రామ్మూర్తి, కార్యదర్శిగా సిద్దయ్య, సంయుక్త కార్యదర్శులుగా రాజగోపాల్, పురుషోత్తం, ఇతర సభ్యులతో ట్రస్ట్ ఏర్పాటు చేశారు. పీలేరు పరిధిలో శ్రీకృష్ణుని ఆలయం నిర్మాణం, గోశాల ఏర్పాటుతో పాటు హిందూ ధర్మాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించేలా భగవద్గీత ప్రవచనాల ద్వారా వివరించే కార్యక్రమాలను నిర్మాణాత్మకంగా నిర్వహిస్తామని తెలిపారు.



నూతనంగా ఎంపికైన కమిటీ సభ్యులు

వాల్మీకి జయంతిని సెలవుగా ప్రకటించాలి

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : వాల్మీకి మహర్షి జయంతిని రాష్ట్ర వ్యాప్తంగా సెలవు దినంగా ప్రకటించకుంటే సహించేది లేదని వాల్మీకి మహాసేన నాయకులు హెచ్చరించారు. మదనపల్లె ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. వాల్మీకులకు అన్యాయం జరుగుతోందన్నారు. ఈ నెల 17న వాల్మీకి జయంతి ఉందని అయితే ఆ పండుగ రోజు సెలవు దినంగా ప్రకటించి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించాలని కోరారు. సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. అనంతరం వాల్మీకి జయంతి ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వాల్మీకి మహాసేన రాష్ట్ర అధ్యక్షుడు ముత్తరాశి హరికృష్ణ, నాయకులు విజయ్‌కుమార్, రవి, శ్రీనివాసులు, మునుస్వామి, బంగారుశంకర్, బొగ్గిటి కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి సమస్యలపై వినతి

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడిని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు కలిశారు. శుక్రవారం శ్రీకాకుళంలో మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నాయకులు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడితో శ్రీరామ్ చినబాబు, నాయకులు

బాధిత కుటుంబాలకు పరామర్శ

వాల్మీకిపురం, న్యూస్‌టుడే : తెదేపా సీనియర్ నాయకుడు చిన్నరామన్న మృతి తెదేపాకు తీరనిలోటని ఆ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి వల్లిగట్ల వెంకటరమణ అన్నారు. మండలంలోని వడ్డిపల్లెలో శుక్రవారం చిన్నరామన్న మృతదేహానికి మండలపార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, కక్రిష్టారెడ్డిలతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి కుటుంబం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. మార్కెట్‌కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ చంద్రమౌళి, మాజీ సర్పంచి రాజేంద్రచారి, తెదేపా నాయకులు రమేష్, గాంధీపేట రమణ, నారాయరణ, ఆనంద, రామకృష్ణ, చంద్ర, ప్రభాకర్ పాల్గొన్నారు.

★ వాల్మీకిపురం మండలంలోని విఠలం పంచాయతీకి చెందిన విశ్రాంత ప్రొఫెసర్, విద్యావేత్త రామచంద్రారెడ్డి (86) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతిచెందారు. మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచి సురేష్‌రెడ్డి, నాయకులు మధనారెడ్డి, సుధాకర్‌రెడ్డి, న్యాయవాది అశోక్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీలేరు : సమాజ సేవకులు తరిగొండ సహదేవయ్య (75) గురువారం రాత్రి మృతి చెందారు. పీలేరు సర్వోదయ ఆశ్రమంలో రూ. రెండు లక్షల వ్యయంతో గదిని, అయ్యపురెడ్డికాలనీలో ఉన్న శిశుమందిరంలో ఒక గదిని నిర్మించారు. తాను చదువుకున్న పాఠశాలలో అదనపు గది నిర్మాణానికి తన వంతుగా రూ. ఒక లక్ష విరాళం ఇచ్చారు. పదో తరగతిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించారు.

బోరుకు మోటారు ఏర్పాటు

పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే: మండలంలోని దేవప్పకోట పంచాయతీ దొరిగుండ్లపల్లిలో శుక్రవారం బోరు మోటారును అమర్చారు. నెల రోజుల కిందట బోరుమోటారు మరమ్మతులకు గురైంది. పంచాయతీ నిధులతో కొత్తది ఏర్పాటు చేసినట్లు సర్పంచి అనిత తెలిపారు.

బదులు బహిరంగ ప్రకటన

10.10.2024వ తేదీన ఈనాడు దిన పత్రిక నందు మార్పురి శ్రీనివాసులు గారి కుమారుడు అయిన మార్పురి శ్రీరాం గారి తరపున శ్రీ డి మురళీక్రిష్ణ న్యాయవాది ద్వారా యిచ్చిన బహిరంగ ప్రకటనకు నా కక్షికర్త అయిన అన్నమయ్య జిల్లా, మదనపల్లి మండలం, మదనపల్లి పోస్టు మరియు టౌను బండమీదకమ్మపల్లి గ్రామం, నీరుగట్టువారిపల్లి రామిరెడ్డి లే అవుట్ మార్కెట్ యార్డు సమీపములో డోరు నెం.3-146-3-డి-9 రులో కాపురం వుండు కోనేటి వెంకటరమణ గారి కుమార్తె కోనేటి సులోచన తరపున యివ్వబడిన బదులు బహిరంగ ప్రకటన ఏమనగా!

షెడ్యూలు దాఖలా ఆస్తి మార్పురి క్రిష్ణమూర్తి గారికి చెంది, అతని పేరు రెవెన్యూ వారు ఖాతా నెం.127 రు నమోదు కాబడి అతని అనంతరం అతని కుమారుడైన మార్పురి వెంకటేశులునకు హక్కు కలిగి 03.02.2023వ తేదీన సదరు మార్పురి వెంకటేశులు రూ. 2,78,71,000/-లు అక్షరాలా రెండు కోట్ల డెబ్బై ఎనిమిది లక్షల డెబ్బై ఒక్క వేలు రూపాయలు నా కక్షికర్త నుండి తీసుకొని, షెడ్యూలు దాఖలా ఆస్తి మరియు ఇతర ఆస్తులు నా కక్షికర్త పేరిట పులివెందల సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసు నందు విక్రయ దస్తావేజు డాక్యుమెంటు నెం.725/2023 రుగా రిజిస్టరు చేయించి, షెడ్యూలు దాఖలా ఆస్తి మరియు ఇతర ఆస్తులు నా కక్షికర్తకు స్వాధీనపరచి యున్నాడు. నా కక్షికర్త షెడ్యూలు దాఖలా ఆస్తి నందు ఆర్.సి.సి.మోల్డింగు మిద్దె మరియు రేకుల షెడ్డు వేసుకొని నా కక్షికర్త యొక్క హక్కు అనుభవములో వున్నది. 10.10.2024వ తేదీన మార్పురి శ్రీరాం గారి యిచ్చిన ప్రకటన యందు విషయములు మరియు షెడ్యూలు దాఖలా ఆస్తి గురించి తప్పుడు విషయములతో ప్రకటన యిచ్చియున్నారు. మార్పురి శ్రీరాం మరియు అతని తండ్రి మార్పురి శ్రీనివాసులు గారికి బండమీదకమ్మపల్లి గ్రామం దాఖలా సర్వే నెం.36 రు నందు ఎలాంటి హక్కు అనుభవము లేదు. షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించి ఇంటి పన్నులు, కరెంటు బిల్లులు నా కక్షికర్త అయిన కోనేటి సులోచన చెల్లించుచున్నది. మరియు నా కక్షికర్త పేరు మునిసిపల్ రికార్డుల యందు నమోదు కాబడినది. షెడ్యూలు దాఖలా ఆస్తి నందు నా కక్షికర్త అయిన కోనేటి సులోచనకు తప్ప ఇతరులకు ఎలాంటి హక్కు అనుభవము లేదు. అని యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూలు

అన్నమయ్య. జిల్లా, మదనపల్లి సబ్.డి., మదనపల్లి మండలం, మదనపల్లి మునిసిపల్ ఏరియా బండమీదకమ్మపల్లి రెవెన్యూ గ్రామం వార్డు నెం.3, నీరుగట్టువారిపల్లి వద్ద గల సర్వే నెం.36/1 రు పైకి డోరు నెం.3-146-3-డి-9 రు, ఆర్.సి.సి.మోల్డింగు మిద్దె మరియు బిడుపు జాగాకు చెక్కుబంది వివరము.

తూర్పు	:	ముద్దెమ్మ ఇల్లు
పడమర	:	తారు రోడ్డు (మదనపల్లి - కదిరి రోడ్డు)
ఉత్తరము	:	మార్కెట్ యార్డు కాంపౌండు గోడ
దక్షిణము	:	మద్దిరెడ్డిగారి జాగా మరియు నాగమణి ఇల్లు

ఈ హద్దుల మధ్యలో గల
తూర్పు పడమర ఉత్తర దిశన 199 అడుగులు లేక 60.655 మీటర్లు
తూర్పు పడమర దక్షిణ దిశన 192 అడుగులు లేక 58.521 మీటర్లు
ఉత్తర దక్షిణం తూర్పు దిశన 70 అడుగులు లేక 21.336 మీటర్లు
ఉత్తర దక్షిణం పడమర దిశన 123 అడుగులు లేక 37.490 మీటర్లు
ఈ కొలతలు గల 2096.19 చదరపు గజములు జాగా, ఇందులో నిర్మించి వుండు 2520 చదరపు అడుగుల ఆర్.సి.సి.మోల్డింగు మిద్దె మరియు 1200 చదరపు అడుగులు గల రేకులతో కప్పబడిన రూములు పూరా. ఇందులకు అమర్చిన తలుపులు, ద్వారబందనములు, కిటికీలు, కరెంటు పరికరములు, కరెంటు మీటరు నెం. 5211300071347, 5211300071371, 5211300071288, 5211300071287, మరియు 5211300063087 వగైరా సహా పూరా.

కంచి మంజునాథ రెడ్డి, B.Com, B.L., అడ్వకేట్, మదనపల్లి.

విజయవంతమైన యాత్ర

కడప విద్య: కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆధ్వర్యంలో విజన్ స్వర్ణాంధ్ర-2047లో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు చేపట్టిన విజ్ఞాన విహార యాత్ర విజయవంతంగా పూర్తయిందని జిల్లా విద్యాశాఖాధికారి అనురాధ అన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఈ నెల 4న ప్రారంభమైన యాత్ర శ్రీకాళహస్తి, శ్రీహరికోట, కొండవీడు, అమరావతి, పిఠాపురం, అన్నవరం, విశాఖపట్నం, సింహాచలం, అరకు, విజయవాడ తదితర ప్రాంతాల్లో సాగిందని వెల్లడించారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు

చిన్నమండెం, పుల్లంపేట, న్యూస్‌టుడే: చిన్నమండెం మండలంలో పనిచేస్తున్న ఐసీడీఎస్ అంగన్‌వాడీ పర్యవేక్షకులు శారదమ్మ, పవనకుమారిలు కలెక్టర్ చామకూరి శ్రీధర్ నుంచి అవార్డులు అందుకున్నారు. రాయచోటిలోని కలెక్టరు కార్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని 'బేటీ బచావో.. బేటీ పఢావో'లో భాగంగా బాల్య వివాహాలు అరికట్టడంలో వీరు ముఖ్యపాత్ర పోషించారు. పుల్లంపేట మండలం సచివాలయం మహిళా పోలీసు పావని బాల్య వివాహాన్ని అడ్డుకున్నందుకు గాను ఆమెకు అవార్డు అందించి ప్రశంసించారు.

పొంచి ఉన్న ప్రమాదం



గాలివీడు-కదిరి ప్రధాన రహదారిలో కుషావతి నది వంతెనపై ఉన్న ముళ్లకంపలు ఏపుగా పెరుగుతున్నాయి. వాటితో ప్రమాదం పొంచి ఉంది. వంతెన దిమ్మెల మధ్య రాళ్ల ముళ్లకంపలు మొలకెత్తాయి. ముళ్లే కదా అని వదిలేస్తే వంతెనకు ప్రమాదకరంగా తయారవుతున్నాయి. వంతెనకు ఇరువైపులా దిమ్మెల వద్ద ముళ్లకంపలు ఉన్నప్పటికీ వంతెన నిర్వహణ, పర్యవేక్షణ కొరవడింది. లోగడ తుపాను వర్షాలకు నదికి నీటి ప్రవాహం అధికం కావడంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిపివేశారు. వాహనాలు రోడ్డు దాటకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసిన సందర్భాలు ఉన్నాయి. సంబంధిత అధికారులు వంతెన భద్రతపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గాలివీడు

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM)
రాజంపేట: 9441872651
రాయచోటి: 9703622242
రైల్వేకోడూరు: 7981695235

స్పందనకు వందనం

సుండుపల్లి: సుండుపల్లి బాలాజీనగర్ మలుపులో చెల్లాచెదురుగా పడి ఉన్న చెత్తను పంచాయతీ సిబ్బంది గురువారం తొలగించారు. మేమున్నాం మీకుతోడుగాలో ఈనెల 5న చెత్త తొలగించండి శీర్షికతో చిత్ర కథనం ప్రచురితమైంది.

వినికిడి పరికరాల అందజేత



పెద్దకారంపల్లి వాసులకు వినికిడి పరికరాలను అందజేస్తున్న భాజపా జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: రాజంపేట మండలం పెద్దకారంపల్లి దళితవాడలో పలువురికి కేంద్ర ప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ ద్వారా భాజపా జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ వినికిడి పరికరాలు అందజేశారు. దివ్యాంగుల కోసం కేంద్ర ప్రభుత్వం ఎంతో చేస్తోందని.. వారికి వివిధ పథకాల ద్వారా చేయూతనిస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కృష్ణయాదవ్, షఫీరెహమాన్, నరేంద్రరాజు, సునీతనారాయణరాజు, ప్రభావతమ్మ, రమణ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు నిరు పేదలకు పంచండి

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూములను నిరుపేదలకు పంచాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అన్వేష్, మండల కార్యదర్శి నరసయ్య డిమాండు చేశారు. ఒంటిమిట్టలో శుక్రవారం సీపీఎం గ్రామ మహాసభలో వారు మాట్లాడుతూ మండలంలో పెన్నపేరూరు, జౌకులపల్లె, వందలాది ఎకరాలను రాజకీయ నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకొని దర్జాగా కబ్జా చేశారని తెలిపారు. గత 12 ఏళ్లుగా ఆక్రమణదారుల గుప్పెట్లో ఉన్న భూములను స్వాధీనం చేసుకోవాలని పోరాటం చేస్తున్నా పట్టించుకునే వారు కరవయ్యారని విమర్శించారు. నాయకులు ప్రసాద్, నరసింహ, రామచంద్రుడు, సాంబయ్య, సురేష్‌బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అన్వేష్

జేజేలు దుర్గమ్మా... కరుణ చూపమ్మా!

రాయచోటి, రాజంపేట రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో దేవీ నవరాత్రులు వైభవంగా సాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా శుక్రవారం మహర్నవమిని పురస్కరించుకుని అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. రైల్వేకోడూరులో అమ్మవారికి కాళీయ మర్దని అలంకారంలో కొలువు దీరారు. పలు చోట్ల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. భక్తులకు అన్నదానం చేశారు. మహిళలు విశేషంగా హాజరై అమ్మవారిని దర్శించుకుని జేజేలు దుర్గమ్మా.. కరుణ చూపమ్మా అంటూ వేడుకున్నారు. **- న్యూస్‌టుడే, రాయచోటి క్లస్టర్ బృందం**



రైల్వేకోడూరులో కాళీయ మర్దని అలంకారంలో దర్శనమిస్తున్న కన్యకాపరమేశ్వరి



సంబేపల్లెలో మహిషాసురమర్దని అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున నల్లగంగమ్మ



వెంకటరాజంపేటలోని శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో శ్రీరాజరాజేశ్వరి దేవిగా



నందలూరు : అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు



చిట్వేలిలో బాలత్రిపురసుందరీదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి



చిన్నమండెం కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ప్రత్యేక పూజలు



రాజంపేట : మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిస్తున్న వాసవీమాత



పుల్లంపేట : తిప్పాయపల్లెలో మహిషాసుర మర్దనిగా కొత్తపురి ఎల్లమ్మ



చిన్నమండెం అమ్మవారిశాలలో వాసవీమాతకు తమలపాకుల అలంకరణ



సుండుపల్లి విజయదుర్గాదేవి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు



రాజంపేట : మన్నూరులోని ఉదయగిరి ఎల్లమ్మ ఆలయంలో లక్ష కుంకుమార్చనలో భక్తులు

ఆగని ఇసుక అక్రమ దందా

నదుల్లో రాత్రిళ్లు చెరబడుతున్నా పట్టని తీరు

- న్యూస్‌టుడే, రాయచోటి, రామాపురం

జిల్లాలో ఉచిత ఇసుక పాలసీ విధానం అమలవుతున్నప్పటికీ అక్రమ రవాణా ఆగడం లేదు. నదులు, వంకలు, వాగుల్లోని ఇసుకను ఇష్టానుసారంగా తవ్వేసి రేయి పగలు అక్రమంగా ఇసుకను ట్రాక్టర్లతో తరలించేస్తున్నారు. జిల్లాలోని ప్రధాన నదులైన మాండవ్య, బాహుదా, పింఛ, పాపఘ్ని, చెయ్యేరు నదుల్లో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అధికారిక క్వారీలలోనూ కొంతలోతు మేరకే ఇసుక తవ్వకాలకు అనుమతిస్తారు. కానీ అక్రమార్కులు నదిలో ఇసుక ఉన్నంత వరకు ఊడ్చేసి తోలేస్తున్నారు. దాంతో భూగర్భజలాలు అడుగంటి నదీ పరివాహక గ్రామాల్లోనూ తాగునీటి ఎద్దడి నెలకొంటోంది. ఫిల్టర్లపై ఆధారపడి సాగు చేసిన వ్యవసాయ పొలాలకు సాగునీరు లేకపోవడంతో పంట పొలాలు బీళ్లుగా మారిన దుస్థితి జిల్లాలో నెలకొంది.



రెడ్డివారిపల్లి వద్ద ఇసుక తరలింపుతో మాండవ్యలో ఏర్పడిన వాహనాల టైర్ల గుర్తులు

వంకల్లో ఇసుక ఊడ్చేశారు

రాయచోటి ప్రాంతంలోని మాండవ్య నది నుంచి ఇసుక అక్రమంగా తవ్వేస్తున్నారు. చిన్నమండెం మండలం వండాడి, రాయచోటి మండలంలోని గొర్లముదివీడు, ఎగువ, దిగువ అబ్బవరాలు, చెన్నముక్కపల్లి, ఇందుకూరుపల్లి, ఓదివీడు, పెద్దివీడు, వీరబల్లి, బొంగావాండ్లపల్లి ప్రాంతాల్లో నది నుంచి ఇసుకను తరలిస్తున్నారు. లక్కిరెడ్డిపల్లి, రామాపురం మండలాలను అనుసంధానం చేసుకుని విస్తరించిన మద్దిరేవుల వంక, రామరాజువంకలలో ఇసుక నిల్వలు అధికంగా ఉన్నాయి. ఈ వంకల నుంచి జేసీబీ యంత్రాలు, కూలీలతో ఇసుకను తవ్వి ట్రాక్టర్ల ద్వారా రాయచోటి, కడప ప్రాంతాలకు తరలిస్తున్నారు. గ్రామస్థాయిలోని రెవెన్యూ, పోలీసుసిబ్బంది కనుసన్నల్లోనే ఇసుక అక్రమ రవాణా కొనసాగుతోందనే విమర్శలు ఉన్నాయి.

చెక్‌డ్యాంలు కూల్చేసి..

నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో గత 15 ఏళ్ల కిందట నదులు, వంకల్లో చెక్‌డ్యాంలు నిర్మించారు. వర్షాకాలంలో చెక్‌డ్యాంలు నీటితో కళకళలాడుతుండేవి. ఇసుక తరలింపు సమయంలో తవ్వకందారులు చెక్‌డ్యాంల కింద వరకు తవ్వేయడంతో అవి పలు చోట్ల కూలిపోయాయి. రామాపురం, లక్కిరెడ్డిపల్లి, వీరబల్లి మండలాలలోని వంకలపై ఉన్న చెక్‌డ్యాంలు చాలా చోట్ల ఆనవాళ్లు లేకుండా పోయాయి. రామాపురం మండలం పాలన్నగారిపల్లి, లక్కిరెడ్డిపల్లె మండలం మద్దిరేవుల, వీరబల్లి మండలం వంగిమళ్ల ఎర్రవంకలపై ఉన్న చెక్‌డ్యాంలు పూర్తిగా కూలిపోవడంతో భారీ వర్షాలు కురిసినా నీరు నిలిచే పరిస్థితి లేదని ఆ ప్రాంత రైతులు ఆవేదన చెందుతున్నారు. చెక్‌డ్యాంలలో నీటి నిల్వల వల్ల బోరుబావుల్లో నీటి నిల్వలు పెరిగేవని నేడు ఆ పరిస్థితి లేదని రామాపురం మండలం పాలన్నగారిపల్లెకు చెందిన రైతు రామకృష్ణ వాపోయారు.



పాలన్నగారిపల్లి వద్ద మద్దిరేవుల వంకలో ఇసుక తోడేయడంతో కూలిపోయిన చెక్‌డ్యాం

తపాలా సేవలు సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న సర్పంచి జంబు సూర్యనారాయణ

నందలూరు, న్యూస్‌టుడే: తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు జంబు సూర్యనారాయణ తెలిపారు. నందలూరులో శుక్రవారం నిర్వహించిన తపాలా వారోత్సవాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఐపీపీబీ మేనేజర్ హిమబిందు, ఏఎస్పీ రెడ్డిబాషా మాట్లాడుతూ.. పోస్ట్‌మెన్ ద్వారా ఇంటి వద్దనే వినియోగదారులు తమ బ్యాంకు ఖాతాల నుంచి నగదు ఉపసంహరణ, నగదు జమతో పాటు నూతన ఖాతాలు తెరవొచ్చన్నారు. అనంతరం తపాలా కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు తపాలా శాఖ పథకాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పోస్టుమాస్టరు పార్థసారథి, తపాలా సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

మహిళలకు బన్సీ రవ్వ పొట్లాల పంపిణీ



మహిళలకు గోధుమ రవ్వను అందజేస్తున్న కైలాస్ గ్రైండ్ మిల్స్ సంస్థ ప్రతినిధులు

రాజంపేట, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని అమ్మవారి భక్తులకు గోల్డెన్ బన్సీ రవ్వ పొట్లాలను పంపిణీ చేసినట్లు కైలాస్ గ్రైండ్ మిల్స్ సంస్థ ఏపీ ఏఎస్ఎం వి.కోటేశ్వర్ తెలిపారు. రాజంపేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారి దర్శనానికి వచ్చిన మహిళలకు రవ్వ పొట్లాలు అందించినట్లు వివరించారు. కార్యక్రమంలో పంపిణీదారు ఆర్ఎస్‌కే ట్రేడర్స్ శివకుమార్, ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

యువకుడి బలవన్మరణం

రైల్వేకోడూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మనస్తాపానికి గురై యువకుడు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతరాజుపేట పంచాయతీ వడ్డిపల్లెకు చెందిన ఆవులకుంట సురేంద్ర (21) కూలి పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. తండ్రి కువైట్‌లో ఉండగా.. తల్లి సక్రమంగా పట్టించుకోవడంలేదనే కారణంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో శుక్రవారం ఉరేసుకున్నాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

రాజంపేట, న్యూస్‌టుడే: స్థానిక రైల్వేస్టేషన్‌కి సమీపంలోని వంతెనపై శుక్రవారం సాయంత్రం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. సరస్వతీపురానికి చెందిన యువకుడు రాజంపేట నుంచి రాయచోటి వైపు ద్విచక్రవాహనంలో వెళుతుండగా.. ఎదురుగా జానీబాషపురానికి చెందిన ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంలో వచ్చి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ గాయాలు కాగా వారిని తిరుపతిలోని ఆసుపత్రికి తరలిచారు. ఎస్ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి దర్యాప్తు చేస్తున్నారు.

సిద్దవటం: సిద్దవటం మండలం కమ్మపాలెం గ్రామానికి చెందిన ఆటో ప్రయాణికులతో కడపకు వెళుతుండగా కనుమలోపల్లిలోని కోతుల వంక రహదారి వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కమ్మపాలెం నివాసి ఓబులమ్మ గాయపడగా, చికిత్స నిమిత్తం ఆమెను కడపకు తరలించారు.

అటవీ చట్టాలపై అవగాహన

సిద్దవటం, న్యూస్‌టుడే : అటవీశాఖ చట్టాలపై గ్రామీణ ప్రజలు అవగాహన పెంచుకుని అధికారులకు సహకరించాలని సిద్దవటం అటవీశాఖ క్షేత్రాధికారిణి కళావతి తెలిపారు. సిద్దవటం మండలంలోని ఎస్.రాజంపేట, వంతాటిపల్లె, జ్యోతి గ్రామాల్లో శుక్రవారం అటవీ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అటవీక్షేత్రాధికారిణి మాట్లాడుతూ ఎర్రచందనం, వన్యప్రాణుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రజలు అధికారులకు సహకరించాలన్నారు. ఉప అటవీక్షేత్రాధికారి ఓబులేసు, బీటు అధికారి పెంచల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్.రాజంపేటలో చట్టాలపై గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న అటవీ క్షేత్రాధికారిణి కళావతి



రాయచోటి

• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

ఆలయ రహదారి నిర్మాణ పనులు ముమ్మరం

చిన్నమండెం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని దేవగుడిపల్లె గ్రామం జల్లావాండ్లపల్లె నుంచి శ్రీమండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి కొండమూల రోడ్డును కలుపుతూ మొదలైన రోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ పనులకు ప్రభుత్వం రూ. 1.55 కోట్లు విడుదల చేసింది. దాదాపు 1.90 కిలో మీటర్ల దూరం ఉన్న ఈ రోడ్డును విశాలవంతంగా వెడల్పు చేశారు. ఒక లేయర్ మట్టితో చేసిన తర్వాత కంకర పరిచి తారు వేసేందుకు సిద్ధం చేశారు. మాండవ్య నదిలో పైపు వంతెన పనులు చివరి దశలో ఉన్నాయి. తారు రోడ్డు పనులు నెలాఖరులోపు పూర్తి చేస్తామని పంచాయతీరాజ్ జేఈ హర్షవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు.

వెలిగల్లులో 2.33 టీఎంసీల నీటి నిల్వ

గాలివీడు, న్యూస్‌టుడే: వెలిగల్లు జలాశయం గరిష్ఠ నీటి సామర్థ్యం 4.64 టీఎంసీలు కాగా శుక్రవారం 2.33 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయని డీఈఈ శిరీష్‌కుమార్ పేర్కొన్నారు. పాపఘ్ని నది ఎగువ ప్రాంతాల్లో సక్రమంగా వర్షాలు కురవకపోవడంతో నీటి ప్రవాహం రాలేదన్నారు. రాయచోటి, గాలివీడు పట్టణాలకు జలాశయం నీటిని ఆరు క్యూసెక్కులు సరఫరా చేస్తున్నామన్నారు. ఎడమ కాలువకు రెండు క్యూసెక్కుల నీటిని విడుదల చేశామన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు. మంగంపేటలో శుక్రవారం వాలీబాల్ టోర్నమెంట్‌ను తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయన్నారు. 26 జట్లతో వాలీబాల్ పోటీలు నిర్వహించడం సంతోషకరమన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ప్రభుత్వం క్రీడాకారుల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సాయివికాష్‌రెడ్డి, కల్లా చలపతి, విశాల్‌రెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.


వాలీబాల్ క్రీడను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్, నాయకులు

నాయనిచెరువులో ఆక్రమణలు తొలగించాలి

గాలివీడు, న్యూస్‌టుడే: గాలివీడు మండలం ఎగువగొట్టివీడు పంచాయతీ మామిళ్లపల్లె సమీపంలోని నాయనిచెరువును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నేత మావులూరి విశ్వనాథ్ డిమాండు చేశారు. ఆక్రమిత ప్రాంతాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. చెరువును ఇప్పటికే నాలుగు ఎకరాల మేర ఆక్రమించి చదును చేశారన్నారు. పశువులు తాగు నీటి కోసం చెరువు వద్దకు వెళ్లకుండా దారులు సైతం మూసివేశారన్నారు. అక్రమాలను అడ్డుకోకపోతే చెరువు రూపురేఖలు మార్చేస్తారన్నారు. అధికారులు సాగునీటి వనరును కాపాడాలని కోరారు.

సరసమైన ధరలకు వంట నూనెలు అందించాలి

రాయచోటి, న్యూస్‌టుడే: వినియోగదారులకు వంట నూనెలు సరసమైన ధరలకు అందించాలని తెదేపా నియోజకవర్గ నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. వంట నూనెలను వినియోగదారులకు తక్కువ ధరకే విక్రయించేలా ఏర్పాటు చేసిన ఎస్‌జేబీ ట్రేడర్స్ కేంద్రాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. విపణిలో ధరలు పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వం ప్రజలకు ధరలు అందుబాటులోకి తెచ్చేందుకు ఇలాంటి కేంద్రాలు ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని నిర్ణయించిన ధరలకే వంట నూనెలు పొందాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.


వంటనూనెల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తెదేపా నేత మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి

తెగుళ్లపై జాగ్రత్తలు తప్పనిసరి

సిద్దవటం: తెగుళ్ల నివారణపై రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని బద్వేలు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు నాగరాజు తెలిపారు. టక్కోలులో ఏటీఎం మోడల్ కింద ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో సాగుచేసిన చీనినిమ్మ పంటను శుక్రవారం పరిశీలించారు.

పేదలకు అన్నదానం

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని టోల్‌గేట్ వద్ద శుక్రవారం జనసేన నాయకులు, కార్యకర్తలు పేదలకు అన్నదానం చేశారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర పుట్టిన రోజు సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టామని నాయకులు జోగినేని మణి, పగడాల వెంకటేష్, రాగిపాటి విజయ్‌కుమార్ తెలిపారు.

ఆరోపణలు సరికాదు

వీరబల్లి, న్యూస్‌టుడే: కూటమి నాయకుల్లో కొందరు గ్రామాభివృద్ధికి సహకరించడం మాని నిధులు స్వాహా చేశారని ఫిర్యాదులు చేసి సర్పంచులపై బురదచల్లడం సరికాదని సర్పంచుల సంఘం నాయకులు నేతి ఆంజనేయులు, నాగార్జున, గోపీనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. వీరబల్లిలో శుక్రవారం వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో చేసిన పనులకే నిధులు రాకుంటే తామెక్కడ స్వాహా చేశామన్నారు. మేరా యాప్‌లో తప్పుడు సమాచారం ఉందని ఆ సమాచారంతో తాము దోచేశామని ఆరోపిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం గౌరవాధ్యక్షుడు గాలివీటి వీరనాగిరెడ్డి, ఈశ్వరయ్య, శివ, రవి పాల్గొన్నారు.